# ప్రయాణం

చక్కరు మహచికాకు పడిపోతున్నాడు. అప్పటికప్పుడే బస్సు బయలుదేర వలసిన టైము దాటిపోయి అరగంటయిపోవస్తోంది.

"బేగిబేగెక్కమని రైట్ చెప్పేస్." అన్నాడు చక్కరు కండక్టరుతో చిరాగ్గా, ఒక ముసల్ది బస్సెక్కింది కొంచెంజాగా వుంటే యిరుక్కువికూచుంది ఆముసల్ది కూచోడంవల్ల చక్కరు ఫోజులు కొడుతున్న పిల్లకి అడ్డం అయిపోయింది.

చక్కరు చికాకెత్తి పోయాడు.

"లెగులెగు. మణుసుల మీద కూర్చుండిపోయేవేటి, ఇది గాదా ఇలారా నీకు సీటు జాపిస్తాను' ' అని ముసల్దానిమీద అఘులు చేశాడు. ముసల్ది అయోమయంగా చూసింది.

చక్కరు ఫోజులు కొడుతున్న పిల్ల ముసిముసినవ్వులు నవ్వింది. ముసల్దాన్ని లేవదీసి అంతకంటే ఇరుగ్గా వున్న మరో సీటులో కూర్చో బెట్టాడు.

రైట్ అన్నాడు కండక్టరు బస్సెక్కి.

డ్రైవర్ సీటులో లేడు. బస్సు పక్క నిలబడి బీడీ దమ్ము లాగుతున్నాడు.

'బేగెక్కమన్నా' అని చక్కరు క్లీనరు కుర్రాడిమీద మండిపడిపోయాడు. క్లీనరు కుర్రాడువెళ్లి డ్రైవర్ని తొందర పెట్టాడు.

'ఎవళెవళన్ని పన్లు చూసుకున్నా లేదుగాని నేను బండి దిగేసరికి తొందరొచ్చిందేటి' అని బీడీ ఒక్క దమ్ములాగి, మునివేళ్ళతో తమాషా విసిరికొట్టి బండెక్కాడు డ్రైవరు.

బస్సు కదిలింది నెమ్మదిగా,

'ఇంకా ఒక్క టిక్కట్టే ఖాళీ' అన్నాడు కండక్టరు చక్కరుతో. ఆలకించి ఏమీ అనకుండా జేబురుమాలు గిరగిరా తిప్పి విసురుకుంటున్నాడు. టెర్లిన్ చొక్కాకి అడుగ్గుండీ వొక్కటే పెట్టుకున్నాడు తక్కిన గుండీ లొదిలీశాడు.

మెళ్ళో పులిగోరు పతకంవుంది. పళ్ళ మీదగారవుంది, తలరింగులు చుట్టుకునుంది, ఒకరింగు మొహంమీద పడుతోంది. కుడిపక్కా, ఎడమపక్కా కణతలమీద కాల్పుమచ్చలున్నాయి కుడిచేతికి రెండుంగరాలు, ఒక వాచీవుంది. ఆ వాచీకి బంగారపు చైనుంది.

బస్సు నింపాదిగా వెళుతోంది.

సరిగ్గా జంక్షన్ దగ్గిర కొచ్చేసరికి తాసిల్దారుగారి బిళ్ళ బంట్రోతు చెయ్యడ్డం పెట్టేడు. అతని కాళ్ళ దగ్గిర పెద్ద తట్టవుంది. దానిలో కమలాపళ్లున్నాయి.

'ఆపాలాపాల రెండు తిక్కట్లు - బాబొస్తన్నారు' అన్నాడు. ఆ అనడం మాంచి ధీమాగా అన్నాడు. ఆపకేం చేస్తారు ?-అన్నంత ధీమాగా అన్నాడు. ఎంతయిదయినా తాసీల్దారు బంట్రోతు !

బస్సాగింది.

రెండు టిక్కెట్లు ఖాళీలేవు అని తప్పకుండా అనేసి రైటు చెప్పేవాడే కండక్టరు, మరొకడయితే. తాసిల్దారుగారు వస్తారనగానే మరేం అన్లేదు.

'ఏటాలిస్యం' అన్నాడు కండక్టరు బస్సు దిగి.

'అబ్బే ఆలిస్సెంనేదు ఎలిపోస్తారు' అన్నాడు బిళ్ళ బంట్రోతు. బర్కిలీ పెట్టిలోంచి చార్‌మినార్ సిగరెట్టుతీసి ముట్టించాడు కండక్టరు. కాణామీద కూచుని సిగరెట్టు కాలుస్తూ టిక్కెట్లు మళ్ళా లెక్క పెట్టాడు, తేడాలేదు – ఒక్కటిక్కట్టే ఖాళీ.

ఈ సారి చక్కరు చికాకుపడలేదు. తాసిల్దారుతో వ్యవ హారం, ఆ తాసిల్దారు బాగా పలుకుబడికలవాడు. ఏమన్నా అంటే అది కాస్తా ఈ బంట్రోతు మోసేస్తాడు. ఏదో సమయంలో యజమాని కనబడితే 'మీ చక్కరు ఏమిటీ చిరాకుపడిపోతుంటాడు' అంటాడు. చివాట్లు ఖాయం. ఇలాటనుభవం లోగడవుంది. సబిన్‌స్పెక్టరు విషయంలో తనోసారిలాగేచికాకుపడ్డాడు. ప్రొప్రయిటరు తనని పట్టుకుని తిట్టేశాడు.(చక్కరుకి ప్రొప్రయిటరు స్వయంగా బావకాకపోయినా వరసకి బావే) "బండిమీద తిరగడం అంటేటనుకుంటన్నవ్ పెద్దమడుస్తులోపని, ఆఫీసర్లతోపని జాగర్తగుండాల' అన్నాడు బావ, ఆ విషయం జ్ఞాపకం వచ్చింది.

చక్కరుకూడా బస్సుదిగి తలుపుపట్టుకుని పిల్లవేపు మొహం పెట్టి సినామా హీరోలా నుంచున్నాడు. ఆ పిల్ల జడకొస విప్పుకుని మళ్ళా అల్లుకుంటోంది.

కొంతమంది ప్రయాణీకులు కూడా దిగేరు.

'ట్రిప్పులుబండి బ్రేక్కాళ్ళబట్టి సరిపోయింది గాని యీపాటికి నెత్తి మీత్తన్నీసును' అన్నాడు చక్కరు.

' రేపులేదెల్లుండొచ్చీదూ' అన్నాడు కండక్టరు.

డ్రైవరుకూడా దిగాదామనుకున్నాడు గాని దిగలేదు - యిందాక బీడీ ముట్టించాడు గాని తృప్తి తీరలేదు. బీడీ తీసుకుని ఒక నాయుణ్ణి అగ్గిపెట్టడిగేడు. అతగాడు లైటిచ్చాడు. మూడుసార్లు ఆరిపోయి నాలుగోసారి మంట నిలిచింది.

'కాజా-కాజా-అణాకొకటి పావలాకయిదు' అంటూ జంగిడి పట్టుకుని ఒక కుర్రాడు బస్సుచుట్టూ తిరుగుతున్నాడు.

తాసిల్దారు బంట్రోతు చుట్టముట్టించి పైక్కనపడకుండా చేతివెనక మూసిపట్టుకున్నాడు. అడపాదడపా బాబుగారొచ్చేవేపు చూసి పొగలాగుతున్నాడు.

బస్సులో యిద్దరు పేపరు పట్టుకుని వాదించుకుంటున్నారు. యిందాక బస్సెక్కిన ముసలమ్మ రొంటిలోంచి చుట్టతీసి ముట్టించింది.

'స్ పుగా' అన్నది చక్కరుకి పోజులు కొడుతున్న పిల్ల, అప్పటికి చక్కరు కండక్టరు పక్కనచేరి సిగరెట్టు కాలుస్తున్నాడు. చూసివుంటే ముసలమ్మచేత తప్పకుండా చుట్ట ఆర్పించేసును.

'బాబుగారొస్తున్నారు' అన్నాడు బిళ్ళబంట్రోతు - గబగబా కమలాపళ్ళ తట్ట బస్సులో పెట్టి ఎదురువెళ్లాడు.

కండక్టరు బస్సెక్కాడు - చోటుఖాళీ చేయడం కోసం. అంతకు కొంచెం సేపు ముందే ఒక ఎలిమెంటరీ స్కూలు పంతుల్ని లేవదీసి హైస్కూలు హెడ్మాష్టారుకి సీటిచ్చాడు - అప్పుడు తాసిల్దారు గారి కోసం ఆయన్ని లేవదియ్యవలసి వచ్చింది.

పేపరు తప్పించి కళ్లజోడులోంచి చూస్తూ "ఏమీ" అన్నారు హైస్కూలు హెడ్ మాస్టారు.

"తాసిల్దారుగారొస్తున్నారు" - అన్నాడు కండక్టరు

ఒక డియీవోవో, పరిషతు చెయిర్మనో, సెక్రటరీవో అయితే లేవాలిగాని, తాసీల్దారొస్తే నేనెందుకు లేవాలీ - - అందా మనుకున్నాడు. అనుకున్నాడుగాని అన్లేదు. మనసులో విసుక్కుంటూ కండక్టరు చూపించిన మరోసీట్లో యిరికి కూచున్నారు.

"నేను ఈమాటే నారిపోర్టులో గవర్నమెంటుకు గట్టిగా రాశాను" అంటున్నారు తాసిల్దారుగారు. ఆయనలో ఎక్కడా చలనం కనబడదు. చుట్టూ కొందరు జనంవున్నారు.

తాసిల్దారు గారిది బట్టతల, ఒడ్డు పొరుగూగల శరీరం, తలమీద సగంనుంచి వెంట్రుకలున్నాయి, అతి నల్లగావుండి లోమా వాసన కొడుతున్నాయి. ఆయన బుగ్గన కారాకిళ్ళీవుంది, మూతిమున్నగా గీసుకున్నారు (సారీ-గీయించుకున్నారు) కొద్దిగా మాసిన గడ్డం, పంచదార జల్లినట్టుంది. ఫుల్‌హాండ్‌షర్ట్ టక్ చేసుకున్నారు. టకప్ ఎగుడూ దిగుడూగావుంది. కాళ్ళకి పాత కాలం నాటి వెడల్పు మూతి బూట్లు, మడమలు ఐకోసుగా అరిగివున్నాయి, చుట్టూ నిలబడ్డవాళ్ళతో మాట్లాడుతూ అటు తెలుగునీ, యిటు ఇంగ్లీషునీ కూడా సమానంగా ఖానీ చేస్తున్నారు.

"ఏమీరా టిక్కట్లు తీసుకున్నావా" అన్నారు.

"చిదం" అన్నాడు బంట్రోతు

అంతా వుట్టిదే, తీసుకోలేదు, తాసీల్దారు గారి మాట విని చుట్టూ నిలబడ్డ వాళ్ళలో ఎవరోఒకరువెళ్ళి టిక్కెట్లు తీసుకోవాలన్నమాట తాసిల్దారు గారి చుట్టూవున్న వాళ్ళు మొహమొహాలు చూసుకున్నారు.

"నమస్తే, రండి బాబూ పోదాం" అన్నాడు కండక్టరు. "నేచెప్పిన వర్క్ కంప్లీటు చేసెయ్యండి. అర్జంటు టపా గవర్నమెంటు నుంచి ఏదయినా వస్తే ఎవరిచేతయినా పంపండి" అన్నారు.

"హెడ్ గుమస్తా అయ్ అలాగేనండి" అన్నాడు. తాసిల్దారుగారు బస్సు ఎక్కుతూవుండగా సెలవిప్పించండి అని కొందరు సెలవు పుచ్చుకున్నారు. చట్టూవున్నవాళ్ళలో ఒకతను తాసిల్దారుగారు బస్సులోకి వెళ్ళాక, కట్టుకున్న చేతులు విడదీసి నిటారుగా నిలబడ్డాడు.

తాసిల్దారుగారు బస్సులోకి రాగానే కొందరు సగం సంగంలేచి నమస్కారం చెప్పారు. కొందరు అసలు లేవకుండా నమస్కారం చెప్పారు. కొందరు ఒక్క చెయ్యీ ఎత్తకుండా నమస్కారం చెప్పారు.

పళ్ళు కనపడేలాగ చిరునవ్వునవ్వి అందరికీ ఒకటే ప్రతి నమస్కారం చెప్పి సీట్లో కూచున్నారు

తాసిల్దారుగారు.

హెడ్‌మేస్టారు యేరకమైన నమస్కారమూ పెట్టలేదు అందుకు కారణాలు రెండు. తనసీటు బాగా మూలకి వుండి తాసిల్దారుగారికి నమస్కారం పెట్టినా ఆయనకు కనపడని స్థితిలో వుండటం ఒకటి, నమస్కారం పెట్టాలని మనసులో అంతగా లేకపోవడం రెండు, హెడ్ మేస్టారు మనసులో "ఎంత యిదయినా రెవిన్యూ డిపార్టుమెంటు అందులోనూ తాసిల్దారు - అనుకున్నారు ఆయన దర్పాన్నీ, ఠీవినీచూసి.

ఎక్కండెక్కండి - అని కేకలు వేసి అంతా ఎక్కాక తలుపు బధేలుమని మూశాడు క్లీనరు కుర్రాడు. చక్కరు బెల్‌కొట్టి రైటుచెప్పేడు. కండక్టరు పరుగెత్తుకుంటువచ్చి ఎక్కి-రైట్ అన్నాడు గట్టిగా. చక్కరు ఫోజులు కొడుతున్న పిల్ల కొంగడ్డంబెట్టుకుని నవ్వింది. కండక్టరుది కాస్త వూబ శరీరం.

"ఇంతలో ఎక్కడికి బోయేవ్ కిళ్లీ కట్టించుకోడానికా ?" అన్నాడు చక్కరు. కండక్టరు బుగ్గని కారాకిళ్ళీవుంది.

బస్సు పరుగు క్రమంగా జోరయ్యింది. "స్పీడుకొట్టు. టైము కలపాల" అని కేకావేశాడు చక్కరు. బస్సు మామూలు టయింకంటె నలభయి నిమషాలులేటు.

తాసీల్దారుగారు పక్కాయనతో మాటలు లంకించుకున్నాడు. ఆయనలో ఒక సుగుణంవుంది, అనేకమంది రివిన్యూ మనుషుల్లాగ పక్కవాళ్ళతో మాట్టాడానికి బెట్టు చూపించరు, తాను తాసిల్‌దారన్నమాట కూడా మర్చిపోతారు. ఎవరితోనయినా ఫ్రీగా మాట్లాడతారు. ఆయన పక్కన కూచున్నవాడు కంట్రాక్టరు. కొద్ది పరిచయం మాత్రం వుంది యిద్దరికీ,

తాసిల్‌దారుగారిది చిన్నగొంతుక్కాదు.

"ఏమిటో ఈ వెధవ పంచాయితీరాజ్‌లో అయిన వాళ్ళకీ కానివాళ్ళకీ జీపులు, తాలూకా హెడ్ తాసిల్దారుకి లేదు"

కంట్రాక్టరు ఏమీ అనడంలేదు. మధ్యమధ్యలో నవ్వుతూ వింటున్నాడు. బస్సు మాంచి స్పీడుమీద వెళుతోంది. కిటికీవార కూచున్నవాళ్ళకి హోరుగాలివల్ల ఊపిరాడ్డంలేదు,, మూడో వరసలో కూచున్న ఒకాయనకి వాంతులు పట్టుకున్నాయి. చక్కరు లేచివచ్చి అతన్ని పట్టుకుని చివరిసీట్లో మూలకి కిటికీ దగ్గిరగా కూచోబెట్టాడు.

"ఇలాంటోళ్లు ముందుగానే చివరిసీట్లో సర్దుకోవాల" అన్నాడు చక్కరు. అటూయిటూ తిరుగుతూ ఆ పిల్లని రెండు సార్లు రాసుకుని వెళ్ళాడు. ఆపిల్ల అదోలా అయిపోయి అదోలా చూసింది. చక్కరు నీరయిపోయాడు, పరవశంతో చుట్టుకుపోయాడు. డ్రైవరుకు బండిలో ఉన్న వాళ్ళేమయి పోతున్నారో తెలీడంలేదు, 70-80 స్పీడుమీద పోనిస్తున్నాడు బండి.

కండక్టరులేచి బిళ్ల బంట్రోతును డబ్బులడిగేడు

నాకాడెక్కడియ్యి ఇందాకా ఆ సేతులు కట్టుకుని నిలబడ్డాయనియ్యలేదా అన్నాడు.

"ఇలాగ అందరికీ జీపు లిచ్చింది గవర్నమెంటు, తాలూకా హెడ్‌కి నాకు జీపులేదు". అంటున్నారు తాసీల్ దారుగారు, ఇంతసేపు తనకంటె తక్కువహోదా, తక్కువ పని వున్నవాళ్ళకెవరికి జీపులున్నదీ

వివరించారు. "నే చెప్పలే ఈ రోజుల్లో నాన్-అఫీషియల్ పీపుల్‌కి ఎక్కువ పవరూ అదీనూ" అన్నారు చివర.

"ఇస్తే నిన్నెందుకడుగుతానూ" అన్నాడు కండక్టరు,

"అమ్మ-తొత్తుకొడుకెంత పని జేశాడూ" అన్నాడు బిళ్ళ బంట్రోతు. కాళ్ళ దగ్గిర కమలాపళ్ల బుట్ట సరిగ్గావుందో లేదో చూసుకుని మళ్ళీ తిన్నగా కూచున్నాడు. మరిప్పు డెలాగా ? - అని సాగదీశాడు మళ్ళీని.

కండక్టరు ఏమందామా అని ఆలోచిస్తున్నాడు.

బస్సు వేగానికి హెడ్ మేస్టారికి చిన్నకునుకు పట్టింది. ఈసారి నేనుచ్చుకుంటాను కద నీకేం పర్లేదు అన్నాడు బిళ్ళ బంట్రోతు. జారని పయిట జారిపోయేలా సర్దుకుని జారిపోయాక చక్కరు కుర్రాడు చూసి కళ్ళెగరేశాక- ఏమీయరగనట్టు పయిట మళ్ళీ సర్దుకుంది పిల్ల.

"ఇప్పుడు నాకెంత టైంవేస్టు చూడండి. ఇదే జీపుంటే..." అంటున్నారు తాసిల్దారుగారు.

రెండు గంటల తరవాత బస్సాగింది. ఇంజను వేడెక్కిపోయింది. "ఒరే బక్కెట్టుతో నీళ్ళెట్టుకొచ్చిపొయ్యి" అని చెప్పి డ్రైవరు దిగిపోయాడు. క్లీనరొచ్చి బాయ్‌నెట్ పైకెత్తేడు, ఇంజన్లో ఆవిర్లొస్తున్నాయి. డీసిలాయిల్ డబ్బాతో బక్కెట్లో నీళ్ళు తీసి రేడియేటర్లో పోస్తున్నాడు.

ఎవరో వచ్చి తాసిల్దారు గారికి నమస్కారం పెట్టారు. కాఫీ తీసుకొచ్చాడు, బిళ్ళ బంట్రోతు పరుగెత్తి కెళ్ళి టిక్కట్టు డబ్బుల సంగతి చెప్పాడు. ఆ ఆసామీ టీ తెప్పించి "యిదితాగు" అని చల్లగా జారుకున్నాడు, ఆహా ఎలాగ మారిపోయారు జనం అనుకున్నాడు బంట్రోతు.

"ఎక్కాలెక్కాల టైములేదు" అని కేకలేస్తున్నాడు కండక్టరు.

హెడ్‌మేస్టారు పేపరు మడిచి, ముక్కుపొడుం ఒకపట్టుపట్టారు, అప్పటికి లోకం అంతా సవ్యంగా ఉన్నట్టు కనబడింది. అంతవరకూ ఉన్న బద్ధకం వదలిపోయి మెదడు పనిచెయ్య నారంభించింది.

"- ఎంత వరకూ వచ్చినట్టూ- సగం దూరం- ఎనిమిదయ్యేసరికి యింటికెళిపోతాం ఫరవాలేదు, లేటు బాగానే కలిపినట్టున్నాడు, సరిగ్గా భోజనాలవేళకి వెళతాను" - అనుకున్నారు స్వగతంలో.

ఆ పిల్ల తాగిన టీ డబ్బులుకూడా తనే యిచ్చేశాడు చక్కరు. కండక్టరు అంతా చూస్తూనేవున్నాడు. వాడికి మాసెడ్డ రోకుగావుంది-అనుకున్నాడు మనసులో. పని జరగని యవహారం. అన్నీ యిలాటియ్యే దొరుకుతాయివాడికి - అనీ అనుకున్నాడు.

మళ్ళీ బస్సుకదిలింది. తాసిల్దారు గారి గొంతు గట్టిగా వినబడుతోంది. బస్సులో దీపాలు వెలిగాయి. తాసిల్దారుగారి దృష్టిలో ప్రభుత్వం తనకి తీరని అన్యాయం చేసింది. గంటన్నర జరగవలసిన దిక్కుమాలి ప్రయాణం మూడు గంటల చిల్లర. తనకే జీపిచ్చివుంటే - యీపాటికి ధనధనా -

"కలెక్టరుగారు విజిటు కొచ్చినప్పుడు నేనామాటే చెప్పాను, చాలా ట్రబుల్‌గావుంది టూర్ చెయ్యడం-అని ఓపెన్‌గా చెప్పేశాను. దట్టూ ఆయనకి నా మీద ఫేవర్, నేను నెల్లూరు డిస్ట్రిక్టులో పని చేస్తున్నప్పుడు ఎన్నో ప్రోబ్లమ్స్ సాల్వ్ చేశాను. అప్పటికి ఈయన డిప్టీకలక్టరు. నా విషయం తెలిసి

ఆ మట్టి ముక్కుమీద వేలేసుకున్నారు. ఆయన రిటయిరయిపోయారుగాని యింతవరకూ ఉంటేనా నాకు తప్పకుండా ఏదోరకంగా జీపు యిచ్చేద్దురు. దట్టూ-ఒక్కమాట చెప్పనా ? నేనొకసారి కాంపు బయల్దేరితే కూడా వో ఆరయ్, వోబంట్రోతూ- వీళ్ళందరరికీ ఒక ట్రిప్పు టీ ఏ లు రాసినా వందదాటిపోతుంది. అలాంటి కేంపులు నెలకి ఆరేడయినా వుంటాయి. అక్కడికేమయింది నాలుగొందలుకాలే ? ఇతర చిల్లర టీయేలు ఓ వంద. ఎంత ? అయిదొందలు, మరి జీపుంటే ఎస్టాబ్లిష్మెంటు కెంతవుతుందీ ? ఇంతకంటే తక్కువే ? దట్టూ - పెట్రోలు ఖర్చులతో కలిపి.

కంట్రాక్టరు బోరెత్తిపోతున్నాడు. తన్నెవరూ యీ ఘోరమయిన ఆపదలోంచి తప్పించలేరా? అన్నట్టు చుట్టుపక్కల జనంవేపు చూస్తున్నాడు.

దట్టూ-అని మళ్ళీ లంకించుకున్నారు తాసిల్దారుగారు, బిళ్ళబంట్రోతు ఒక కమలాపండు తీసుకుని ఒల్చుకుని తింటున్నాడు. బస్సాగింది. ఆ పిల్ల దిగిపోయింది. తోవకడ్డం నిలబడి ఆఖరిసారి కాస్త స్పర్శ సుఖం అనుభవించేడు చక్కరు. బస్సుదిగిపోయి ఆపిల్ల చక్కరు వేపు ఒక్కచూపు విసిరింది. చక్కరు అయిసయిపోయాడు. బస్సుకదిలింది. బస్సు నిర్జీవంగా కనపడింది. కనపడుతున్న ఈ మనుషులంతా జీవంలేని వాళ్ళలా వున్నారు - అనుకున్నాడు. ఛీ! దిక్కుమాలి ఉద్యోగం-నేనూ పేసింజర్నయితే హాయిగా దిగిపోకపోనూ అనుకున్నాడు.

"దట్టూ, యిది నాపర్సనల్ జర్నీ గనక సరిపోయింది లేకపోతే నా కూడా ఒక ఆరయ్, ఒక ప్యూనూ-అంతా ఉందురు. ఈ సారి బంట్రోతొకడే దట్టూ వాడూ ఇటే రావలసివచ్చింది గనక....."

ఈ బస్సు ఆగిపోయి తను దిగిపోతే ఎంతయినా బాగుణ్ను అనుకుంటున్నాడు కంట్రాక్టరు. బస్సు మాంఛి స్పీడ్లో వెళుతోంది. మూలని కూచున్న ముసలమ్మ పక్క మనిషిమీద పడిపోతోంది. ఆ మనిషి విసుక్కుంటున్నాడు. వాంతులు చేసుకున్నాయన మొహం మీద గుడ్డ కప్పుకున్నాడు. కండక్టరు అట్టపట్టుకుని ఎస్.ఆర్. నింపుతున్నాడు. గుడుగుడు శబ్దం చేసి బస్సాగిపోయింది.

"ఏట్రా" అని కేకేశాడు కండక్టరు, బస్సెందుకు ఆగిందీ ఎవరికీ తెలీదు. డ్రైవరు మాట్లాడకుండా బస్సుదిగి పోయాడు, బాగా చీకటి పడింది. బేటరీ పట్టుకుని డ్రైవరూ, క్లీనరూ బస్సుకింద దూరారు, తాసిల్దారుగారు కూడా బస్సు దిగారు, కనిపిస్తే ఎక్కడ పట్టుకుంటాడోనని ఎదరికి నాలుగడుగులు నడిచి ఓవారకి నిలబడి సిగరెట్టు వెలిగించుకున్నాడు కంట్రాక్టరు.

బిళ్ళబంట్రోతు తాసిల్దారుగారి దగ్గిరికెళ్ళి నిలబడ్డాడు, బస్సులో దీపాల వెల్తురు చుట్టూ చీకట్లని ఏమీ చెయ్యలేక పోతున్నది.

తనకి జీపు లేకపోవడం వల్ల ఎంత చిక్కొచ్చిందో తాసిల్దార్గారు ఆలోచిస్తున్నారు.

"వెధవ ప్రయాణం ఇంతసేపా?"

"చిదం-బయలెల్లడమే ఆలిస్సెవండి"

"అసలెందు కాగిందీ?"

"కనుక్కుంటానుండండి బాబయ్య" అని నాలుగడుగులు వేశాడు బంట్రోతు,

కండక్టరు తన శరీరాన్ని కూడా బస్సుకిందికి నెట్టి వంగి కూచున్నాడు, చక్కరు ఎటుపోయాడో అక్కడ మాత్రంలేదు,

"ఏపాటాలిస్యం కండ్రక్టుగారూ" అన్నా డు బంట్రోతు. అతగాడు కండక్టరుని ఒకసారి ఏమండీ అని, ఒకోసారి ఏమయ్యా అనీ అంటాడు 'నువ్వేటేశ్-' అని గసిరేశాడు కండక్టరు.

కొసని ఓబూతు మాటకూడా ప్రయోగించాడు.

బంట్రోతు దెబ్బతినీశాడు, తాసీల్‌దారుబంట్రోతుని తననే యింత మాటన్నాడా ? చూసుకునుండడు, అయినా తాసీల్‌దార్ బంట్రోతయితే ఎక్కువేటి ? అంతే - అంతే- చూసుకునుండడు. లేకపోతే ఎప్పుడూ అంత పెద్దమాట వాడడు పైగా బండి రిపేరొచ్చిందిగదా పాపం అంత కడుపుతో బండికింద ఎలా దూరాడో కండక్టరు. పొట్టతో బస్సుకింద దూరడం అన్న దృశ్యం కళ్ళల్లో మొదిలి నవ్వుకున్నాడు బిళ్ళ బంట్రోతు.

'మా డబ్బు లిచ్చీ మాంపోతాం - ఎంతసేపీసేవ' అంటున్నారప్పుడే కొందరు, హెడ్ మేస్టారు బండిదిగలేదు, ఒక పొడుం పట్టుపట్టి అలాగే కూచున్నాడు. "బండి కండిషన్‌లో లేకుండా ఎలానడుపుతారో యీ బస్సులవాళ్ళు - ఎంతసేపూ డబ్బు ధ్యానమేగాని ప్రయాణీకుల సౌకర్యం ఆలోచించడం మరిలేదు వీళ్ళకి" అన్నారు స్వగతంలాగ.

తాసిల్దారు గారు ఒక్కరూ చీకట్లో నిలబడిపోయారు. అతని మనసంతా మహచికాగ్గావుంది. ఇలాటి చికాకే ఆఫీసులోనే వుంటేనా-ఎందరు చివాట్లు తిందురో-ఎందరికి మెమోలు వెళిపోనో-యిక్కడెవడికివ్వడం మెమో?

గవర్నమెంటుకి బుద్ధిలేదు-తాసిల్దారుకి-దట్టూ తన లాంటి సీనియర్ మోస్ట్ తాసిల్దారుకి జీపు లేకపోవడమా ? డామ్ షేమ్-యిప్పుడు తన ప్రయాణం ఎలాగ? బస్సాగిపోయి అరగంటయిపోయింది.

దగ్గిర దూరాల వాళ్ళు దారి పట్టీశారు. డబ్బులు తిరిగి రావాలనుకునీవాళ్ళు కండక్టరు దగ్గిర చేరారు. తరవాత మరో బండిలేదు. కటిక చీకటి. ఏడున్నరవ్వొస్తోంది. రిపేరు కాదా ? కొంపముంచి బండి మరి కదల్దంటే-ప్రయాణం ఏంగాను?! పెళ్ళాంతో రాత్రికి వచ్చేస్తానని చెప్పాడే. వెళ్ళకపోతే యింకేమయినా ఉందా ? ఇప్పుడెలాగ ...!

ఇది ఒక వూరూగాదూ పాడూగాదు-నడదారి--

ఒకలారీ, నిండా మనుషుల్తో బస్సుని తప్పించుకుని పోయింది. కొందరు దాన్ని పట్టుకుని వేళ్లాడారు. చక్కరు దాంట్లో ఎక్కీశాడు, గొప్ప చాకచక్యంగా, "మన షెడ్డుకు కబురు చెబుతానూ" అని కేకేశాడు.

తాసిల్దారుగారికేమీ తోచడంలేదు. కోపం క్రమంగా విచారంలోకి దిగింది. తను తాసిల్దారుకాక మామూలు మనిషయితే-ఆ లారీ పట్టుకు వేలాడి అందరిలాగా వెళిపోడా ? దిక్కు మాలి తాసిల్దారుజ్జోగం! జీపులేని తాసిల్దారుజ్జోగం ! ధూత్-.

కంట్రాక్టరు కనపడతాడేమో హస్కు వేద్దామంటే అతను పత్తాలేడు. హెడ్‌మేస్టారుకూడా బస్సు దిగేరు. అతని చేతిలో ఏ బరువూలేదు, పేపరుతప్ప, చుట్టూ చూశారు. క్రమంగా దారి పట్టేరు. కండక్టరు

బండి కిందనుంచి బయటి కొచ్చాడు. "బాబూ షమించాలి. మరి బండి కదల్దు, ఎవరెవరికి డబ్బులు వాపసు యివ్వాలో రండి" అన్నాడు. పాలోమని ఒక పదిమంది అతని చుట్టూ చేరారు.

"హన్న చంపేశాడు. దట్టూ-రాత్రి భాగం" అనుకున్నారు తాసిల్దర్‌గారు. యించుమించు యవ్వరూ లేనట్టే, అంతా నడక పుచ్చుకున్నారు.

"బాబూ తమరిక్కడ నిలబడి పోయారా- బండిలో కూసోండి" అన్నాడు కండక్టరు. ఆ మాటలు తనని ఎత్తి పొడుస్తున్నట్టని పించాయి. బంట్రోతు అక్కడే నిలబడి వున్నాడు.

"ఎలా వెళ్ళడం?" అన్నారు.

"అదేటి బాబూ బోల్డు లారీలు జీపులు-తమరి పేరు చెబితే ఎవరయినా తీసికెళ్తారు"

ఆ మాట వినీసరికి తాసిల్దారు గారికి ధైర్యం వచ్చింది.

"బండి పక్కకన్నా పెట్టేవుకావురా" అన్నాడు కండక్టరు డ్రైవరుతో.

"నీకేటి తెలుసొరే-యిలాగవుద్దని నాకనుమానంగానే వుంది నిన్నట్నించీను, కాని యింతట్లో ఫరవాలేదనుకొన్నాను " అన్నాడు.

"స్పీడు బాగా పెట్టేశావు"

"మరి అంతసేపు.... కూచున్నారు. టైము కలపాలంటే మరేటి చెయ్యడం" అన్నాడు డ్రైవరు. ఒక ఘాటయిన బూతుమాట వాడాడు. వళ్ళు మండిపోయింది. అన్నిటికీ డ్రైవోరేనేట్రా అనువూ "- అని తగులుకున్నాడు.

మరి వీడితో చాల్లేం - అనుకుని కండక్టరు తగ్గిపోయాడు.

ఎనిమిదికూడా దాటిపోయింది. నిలబడి నిలబడి తాసిల్దారుగారి కాళ్ళు పీక్కు పోతున్నాయి.

"యిక్కడికి ట్రంకురోడ్డునాలుగుమైళ్ళే. యీలైన్లో కంటే ఆ లైన్లో బస్సులెచ్చు" ఈ మాటలు బంట్రోతుతో తాసిల్దారు వినేలా అన్నాడు కండక్టరు.

"ఏటి సేద్దాం బాబూ" అన్నాడు బంట్రోతు. నడిసేద్దాం బాబూ అనడానికి ధైర్యం చాల్లేదు.

"నింపాదిగా నడిచేద్దా వేమిట్రా" అన్నారు తాసిల్దారుగారు.

"తమరు నడుస్తారాండీ-ఏజీపో వస్తాదేమో సూద్దావండి" అన్నాడు బంట్రోతు. ఆఖరికి వీడుకూడా తనని దెప్పుతున్నట్టే అనిపించింది.

"యింకేం జీపూ-దట్టూ యీ రాత్రి వేళ? పద!" అన్నారు తాసిల్దారుగారు. ఘోరం. జీపు మీద వెళ్ళవలసిన ఆఫీసరుకి ఈనాడు ఎంతగతి పట్టింది - అని మనసులోనే కుళ్ళిపోతున్నారు.

కమలాపళ్ళ తట్ట పట్టుకున్నాడు బిళ్ళబంట్రోతు. వెనకనుంచి కండక్టరు రెండు పళ్ళు తీశాడు, బంట్రోతు చూడకుండా. వాడేమన్నా కొన్నాడా యేడిశాడా ఎవడి బుర్రో కొట్టినవేగదా అనుకున్నాడు మనసులో.

ఒకసారి అటుయిటూ చూసి ముందుకు అడుగులు వేశారు తాసిల్దారుగారు, బిళ్ళబంట్రోతు అనుసరించాడు.

***కథాకాలం : 1970 రచన : 31-8-71 ప్రప్రథమంగా ఆంధ్రప్రభ వారపత్రికలో 71 నవంబరులో ప్రచురితమయింది. పునర్ముద్రణ : అవగాహన - 4, 1981 జూన్***